క్లుప్తంగా

తీరు మారకుంటే చర్యలు తప్పవు



పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న ఎంఈఓ జ్యోతి

అనుమసముద్రంపేట: విధి నిర్వహణలో మీ తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఎంఈఓ జ్యోతి ఓ ఉపాధ్యాయుడిని హెచ్చరించారు. ఏపీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటరమణ విద్యార్థినులు, ఉపాధ్యాయులతో అనుచిత ప్రవర్తనతో వ్యవహరిస్తున్నాడు. ఈ విషయమై కొద్ది రోజుల క్రితం విద్యార్థినులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె శనివారం ఆ ఉపాధ్యాయుడిపై విచారణ నిర్వహించారు. తరగతులు జరిగే సమయంలో విద్యార్థులకు పాఠాలు బోధించకుండా వేరే ఇతర అంశాలను బోధించడం, విద్యార్థులకు నచ్చడం లేదు. ప్రిన్సిపల్‌పై సైతం అతను పెత్తనం చెల్లాయిస్తున్నాడు. ఈ ఉపాధ్యాయుడి తీరుపై ఎంఈఓలు జ్యోతి, సాయిప్రసాద్ విచారణ నిర్వహించి ఉపాధ్యాయుడిని హెచ్చరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



5వ వార్డులో బాధిత కుటుంబాలకు సాయం అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు, కౌన్సిలర్లు

ఆత్మకూరు: పట్టణానికి చెందిన సాంబశివా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి నేతృత్వంలో వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి అంత్యక్రియల కోసం శనివారం ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 5వ వార్డు పరిధిలో షేక్ హుస్సేన్‌బీ, తాపీమేస్త్రీ షేక్ ఖాజా రంతుల్లా, 16వ వార్డులో వల్లెపు చెంచయ్య, 20వ వార్డులో నాగులూరు వెంగయ్య, 1వ వార్డు ముస్తాపురంలో కొండా అంకమ్మ, 2వ వార్డు వెంక్రటావుపల్లిలో ఇరగన వెంకటేశ్వర్లు మృతి చెందడంతో ఆయా కుటుంబ సభ్యులకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకోటారెడ్డి, షేక్ మహబూబ్‌బాషా, సూరా భాస్కర్‌రెడ్డి, కూరగాయల శీనయ్య, మెప్మా ఆర్పీలు రాయిషాబేగం, మహబూబ్‌జానీ, వెంకట రమణమ్మ, ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న వైస్ చైర్మన్ సర్దార్

ఆత్మకూరు: పట్టణంలోని 17వ వార్డు పరిధిలో తిప్ప ప్రాంతంలో ఇటీవల తుఫాన్‌కు నాలుగు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్ ఆధ్వర్యంలో నూతన విద్యుత్ స్తంభాలను శనివారం ఏర్పాటు చేశారు. సర్దార్ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.

ఉద్యమాల నేత సాబ్జి



ఎమ్మెల్సీ సాబ్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) తరఫున ఉద్యమాలు నిర్వహించిన పోరాట యోధుడు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఆకస్మిక మృతి దిగ్భ్రాంతికరమని, ఆయన లేనిలోటు తీర్చలేనిదని పలువురు యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు అన్నారు. ఎమ్మెల్సీ సాబ్జి ఆకస్మిక మృతితో శనివారం సాయంత్రం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శివప్రసాద్ నేతృత్వంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో మౌన సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, ఏఎస్‌పేట, మర్రిపాడు, అనంతసాగరం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు సోమశిల శివాలయంలో భూపూజ

సోమశిల: కామాక్షి సమేత సోమేశ్వరాలయంలో సోమవారం భూపూజ మహోత్సవం జరగనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల ఉప్పల సోమసుందరమూర్తి, ఉప్పల విజయ్ కుమార్ శనివారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు అమ్మవారి ఆలయం, గాలిగోపురం నిర్మాణాలకు శాస్త్రోక్తంగా భూపూజ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

బతుకు భరోసా

కడలే వారికి అమ్మఒడి. అలల సవ్వడులే వారికి జోలపాట. సాగరంలో వేట జీవనంగా సాగుతున్న మత్స్యకారుల జీవన శైలి విభిన్నం. ఇల్లు వదిలి సముద్రంలోకి వెళ్లి తిరిగొచ్చే వరకు అనుక్షణం ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొంటూ నిత్యం ఆటుపోటుల మధ్య సాగే వీరి జీవనం సమరం. భీతిల్లే అలల్లో ఊయాలలు ఊగినంతగా అలవొకగా జలరాసిపై అనునిత్యం సాగర మథనం. అగాధ జలనిధిలో సాహస సమరంతో జీవనం సాగించే మత్స్యకారులు దినదిన గండంగా గట్టెకున్నారు. గత ప్రభుత్వాలు వీరిని ఓటు బ్యాంక్‌గా భావిస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచే వీరి జీవన స్థితిగతులు మార్చే విధంగా అండగా నిలబడుతున్నారు.



చేపలు వేట చేసే వలలను మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

కడలి పుత్రులకు ప్రభుత్వం అండ
- నియోజకవర్గంలో 4,912 మందికి లబ్ధి
- వరుసగా ఐదేళ్లు ఏటా రూ.10 వేల వంతున అందజేత

కావలి: సముద్రంలో వేటే జీవనాధారంగా సాగించే మత్స్యకారులకు మరో జీవనాధారం లేదు. ప్రకృతి వైపరీత్యాలు, వేట నిషేధ కాలంతో వేట సాగక బతుకు జీవనం లేని కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదారంగా ఆదుకుంటున్నారు. క్షణక్షణం గండంగా సాగే మత్స్యకారుల ప్రాణాలకు హాని కలిగితే ఆ కుటుంబం వీధిన పడకుండా అండగా నిలబడుతున్నారు. వేట సమయంలో వినియోగించే డీజిల్‌కు సబ్సిడీ రూపంలో అందజేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలి ఏడాది నుంచే మత్స్యకారులు ఎదుర్కొనే ఆటుపోటులకు అండగా ఉండి ఆదుకుంటున్నారు. ఓ వైపు ప్రభుత్వం ప్రోత్సాహం, సహకారం ఉన్నా.. వాతావరణ ప్రతికూలత రోజులు ఎక్కువగా ఉండడంతో వేట సాగక అవస్థలు పడుతున్నారు. సముద్రంలో చేపలు పిల్లలు పొదిగే కాలంలో 61 రోజులు వేట నిషేధం కొనసాగుతోంది. ఆ కాలంలో ఆ కుటుంబాలను ఆదుకునేందుకు వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద వరుసగా ఐదో ఏడాది ఆర్థిక సాయం అందజేసింది.

కావలి నియోజకవర్గంలో కావలిరూరల్, బోగోలు, అల్లూరు మండలాల పరిధిలో 55 కి.మీ. సముద్ర తీరం విస్తరించి ఉంది. సముద్ర తీరం వెంబడి 35 గ్రామాల్లో 14,500 మంది చేపల వేటే వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. 21- 60 ఏళ్ల లోపు మత్స్యకారుడై ఉండి, ప్రభుత్వం నుంచి ప్రతి నెలా ఇతర పింఛన్లు ఏవీ తీసుకోకుండా ఉన్న మత్స్యకారులను గుర్తించి వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద ఏటా రూ.10 వేల వంతున ఆర్థిక సాయం అందజేస్తోంది. నియోజకవర్గంలో ఈ కేటగిరీలో 4,912 మంది మత్స్యకారులు ఉన్నారు.

టీడీపీ హయాంలో అరకొర మందికే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హులైన మత్స్యకారులకు రూ.4,000 ఇస్తామని చెప్పి, నియోజకవర్గంలో కేవలం 1,500 మందికి మాత్రమే ఇస్తుండేవారు. మిగిలిన వారికి మొండి చేయి చూపేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో ఫిషరీస్ అసిస్టెంట్ అనే ఉద్యోగిని నియమించడం ద్వారా, మత్స్యకారులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదవుతోంది. దీంతో మరింత మంది మత్స్యకారులకు ఎటువంటి సిఫారసులు లేకుండానే, అర్హతలనే ప్రామాణికంగా తీసుకుని నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వలంటీర్లు వెళ్లి వివరాలు సేకరించడంతో మరింత మందికి వైఎస్సార్ మత్స్యకార భరోసా కింది రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందింది.

అర్హతే ప్రామాణికంగా ఆర్థిక సాయం



ప్రభుత్వ ఆర్థిక సహాయం సీఎం జగన్ ప్రభుత్వంలో అర్హులైన అందరికీ రూ.10,000 చొప్పున నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుంది. టీడీపీ ప్రభుత్వంలో కేవలం రూ.4,000 ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పే వారే కాని, ఇచ్చేవారు కాదు. మత్స్యశాఖ అధికారుల చుట్టూ తిరిగినా కనికరించే వారు కాదు. అసలు ఎందుకు ఆర్థిక సహాయం అందదో కూడా అధికారులు చెప్పలేకపోయేవారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో అధికారులే మత్స్యకారుల ఇంటికి వచ్చి అన్ని వివరాలు అడిగి రాసుకుని అవసరమైనవి జెరాక్స్‌లు తీసుకెళ్తున్నారు.

– కొమారి రాజు, మత్స్యకారుడు, తుమ్మలపెంట, కావలి రూరల్ మండలం

అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్రం సంక్షేమ పథకాలు



వికసిత్ భారత్ సంకల్పయాత్రలో మాట్లాడుతున్న బీజేపీ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి

ఆత్మకూరురూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్రం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నేత కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గండ్లవీడులో సర్పంచ్ అధ్యక్షతన, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సురేంద్రరెడ్డి, కాకు విజయలక్ష్మి, ఆత్మకూరు అసెంబ్లీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దేశాన్ని అన్ని రంగాల్లో పటిష్టమైన దేశంగా చేసేందుకు ప్రధాని నిరంతరం కృషి చేస్తున్నారని, పేదల ముఖంలో చిరునవ్వులు చూడాలని అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ కో-కన్వీనర్ నరసింహనాయుడు, మండల కన్వీనర్ వాసుపల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు భరత్‌రెడ్డి, హర్షవర్ధన్, సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మేకపాటి పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న మేకపాటి

వరికుంటపాడు: మండలంలోని భోగ్యంవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ వీరాభిమాని నల్లబోతుల వీరాంజనేయులు శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఉదయగిరి సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గ్రామానికి చేరుకుని వీరాంజనేయులు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరా మర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు, డైరెక్టర్ జక్కం శ్రీనివాసులరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ ఆలీఅహ్మద్, నాయకులు మందలపు తిరుపతి నాయుడు తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం మెరుగుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ మల్లికార్జున

ఉదయగిరి: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ ఎస్.మల్లికార్జున చెప్పారు. ఆయన శనివారం తన కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పారిశుధ్యం కొరవడుతుందన్నారు. బ్లీచింగ్, ఫినాయిల్ అందుబాటులో ఉంచుకుని ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు పాటించాలన్నారు. గ్రామ పంచాయతీలు నిర్వహించే వీధి దీపాల మీటర్ల ప్రస్తుత స్థితి, వివరాలు, జియో ట్యాగ్ చేసి యాప్‌లో పొందుపర్చాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద మండలానికి 90 మరుగుదొడ్లు మంజూరయ్యాయని, నిర్మాణాలు మొదలు పెట్టి జియో ట్యాగ్ చేసి ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు.

పాడి రైతులకు ఉచితంగా పశు దాణా



పశు దాణాను అందజేస్తున్న ఆనం అరుణమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: తుఫాన్ కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పశు దాణాకు కొరత ఏర్పడిందని, ఈ క్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పాడి రైతులకు ఉచితంగా అందజేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని పశు వైద్యశాలలో పాడి రైతులకు టీఎమ్మార్ పశు దాణాను శనివారం అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారడంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడిందని చెప్పారు. చింతారెడ్డిపాళెం, సౌత్‌రాజుపాళెం ప్రాంతాల్లో రెండు మెట్రిక్ టన్నుల దాణాను పాడి రైతులకు అందజేశామని వివరించారు. పశుసంవర్ధక శాఖ డీడీ నాగమణి, ఏడీ అరుణ పాల్గొన్నారు.

నాడు – నేడు పనుల పరిశీలన

చింతారెడ్డిపాళెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు.

మా నమ్మకం నువ్వే జగన్‌పై సర్వే

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలో శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' సర్వేను సచివాలయాల మండల కో-ఆర్డినేటర్ అక్కల రెడ్డి అంకిరెడ్డి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు, ప్రస్తుతం అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు వివరించామన్నారు. సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ సచివాలయ వలంటీర్లకు సూచించినట్లు తెలిపారు. గ్రామ సచివాలయ కన్వీనర్ బత్రెడ్డి పోలిరెడ్డి, ముక్కు మస్తాన్‌గౌడ్, నాయకులు గుండుబోయిన వెంకటరమణ, గుండుబోయిన కృష్ణయ్య, కాలేషా పాల్గొన్నారు.

వైభవంగా హరేరామ హరేకృష్ణ



హరేరామ హరేకృష్ణ రథయాత్రలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

కావలి: పట్టణంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు హరేరామ హరే కృష్ణ నామస్మరణంతో మార్మోగిపోయింది. గౌర నితాయ్ (కృష్ణ-బలరామ్) రథయాత్రను స్థానిక ఆరెస్సార్ కల్యాణ మండపం నుంచి పట్టణ వీధులు, ట్రంక్‌రోడ్డులో పెద్ద ఎత్తున కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు నడమ ఈ రథయాత్ర భక్తి పారవశ్యంతో సాగింది.

నాడు నేడు పనుల పరిశీలన

సోమశిల: అనంతసాగరం మండలం వెంగంపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నాడు-నేడు పనులను పరిశీలించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, దేవరాయపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉర్దూ పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యతపై పలు సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన

ఉదయగిరి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎంఈఓ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. తాము సుమారు 18 ఏళ్లుగా పని చేస్తున్నామని, రెగ్యులర్ చేయాలని, మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని, నాలుగు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అలీం, డేటా ఆపరేటర్ కె.వశీం, సీఆర్‌ఎంటీలు ఇనయతుల్లా, శ్రీనివాసులు, రమణారెడ్డి, హాజీరా, మొహిద్దీన్, మౌలాద్రి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనే సీఎం జగన్ లక్ష్యం



ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న కొమారి రాజు

- వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమారి రాజు

కావలి: సమాజంలో అన్ని కులాలు, మతాలు, వర్గాలను అన్ని రకాలుగా అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ సమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమారి రాజు అన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని శనివారం ఆయన నివాసంలో కొమారి రాజు కలిసి తనకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి కమిటీలో తనకు చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కొమారి రాజు మాట్లాడుతూ చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి చేసింది ఏం లేదన్నారు. తెలంగాణలో జీవనం సాగిస్తూ ఆంధ్రాలో రాజకీయం చేయడం చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్‌కే చెల్లిందని విమర్శించారు. ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ పరాయి రాష్ట్రంలో ఉండి ఆంధ్ర రాష్ట్రంలో విషం చిమ్ముతున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ రూ.2.5 లక్షల కోట్లు ఖర్చు పెడితే గతంలో అధికారంలో ఉన్న చంద్రబాబు ఆ సొమ్మును ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఒక పోర్టు, మెడికల్ కాలేజీ, హార్బర్ ఏమీ నిర్మించలేదని, అప్పులు మాత్రం దండిగా వదిలి వెళ్లారన్నారన్నారు. గత ప్రభుత్వం వెనుకబడిన వర్గాలను పట్టించుకోలేదు. దళితుల్ని అవమానించిన వ్యక్తి చంద్రబాబు అయితే, వెనుకబడిన వర్గాలను జగన్ గుండెల్లో పెట్టుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం చేసిన నాయకుడు చెప్పారు. కేబినెట్‌లో, నామినేటెడ్ పోస్టుల భర్తీల్లోనూ వెనుకబడిన వర్గాల వాళ్లకే ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే జగనన్న లక్ష్యం

- ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి

సీతారామపురం: రాష్ట్రంలోని ప్రతి పేద వారికి సొంతింటి కలను సాకారం చేయాలని ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యంగా పెట్టుకున్నారని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల్లో ఇల్లు లేని వారు ఇంకా ఎవరైనా ఉంటే గుర్తించాలన్నారు. అధికారుల సమన్వయంతో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ద్వారా ఇంటి స్థలం లేని వారికి స్థలం ఇప్పించడంతో పాటు ఇల్లు కట్టించే వరకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. గ్రామాల్లో ఒక్క ఇల్లులేని పేద వారు ఉండకూడదని ప్రభుత్వ లక్ష్యమన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 100 పని దినాలు త్వరితగతిన కల్పించాలన్నారు. సిబ్బంది గ్రామానికి అవసరమైన పనులు కల్పించి కూలీలకు గిట్టుబాటు కూలి అందేలా చూడాలన్నారు. ఉపాధి పనులు జరిగేటప్పుడు కూలీలకు అవసరం అయిన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉపాధి పనులు కల్పనలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సర్పంచ్‌లను స్వమన్వయం చేసుకుని పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలో మరమ్మతులకు గురైన మంచి నీటి పథకాలు చేతి పంపులను తక్షణమే బాగు చేయించాలన్నారు. వాతావరణం పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపడుతుండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుధాకర్, ఎంపీడీఓ రంగ సుబ్బారాయుడు, ఎంఈఓ మస్తాన్‌వలి, ఏఓ చెన్నారెడ్డి, ఈఓపీఆర్డీ భార్గవి, ఇన్‌చార్జి ఏఈ బాలినేని ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దర్గా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నేతలు

అనుమసముద్రంపేట: హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సమావేశాన్ని శనివారం దర్గా ప్రాంగణంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దర్గా నూతన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సీహెచ్ చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాజాహుస్సేన్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ సాజిద్, సహాయ కార్యదర్శిగా సీహెచ్ మస్తాన్, ట్రెజరర్‌గా షేక్ రహమత్ బాషా, కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గాన్ని దర్గా ఈఓ షేక్ షరీఫ్ అభినందించారు. సీఐటీయూ నాయకులు జీ శివప్రసాద్, కె హజరత్తయ్య, షేక్ చాంద్‌బాషా, జీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షించిస్తున్న డాక్టర్ ప్రమీల

ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లిలో శనివారం మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రవాస భారతీయురాలు డాక్టర్ ప్రమీల మాదమాల ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 100 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. మూడు నెలలకు సరిపడా షుగర్, బీపీ మందులను ఆలంబన ఫౌండేషన్ ఇండియా సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో చెర్లోయడవల్లి ఫౌండేషన్ చైర్మన్ అల్లంపాటి వెంకట రాజేష్, అంబటి రాధాకృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎం శంషాద్‌బేగం, మాధురి, విలేజ్ పోలీస్ సుప్రజ, ఆశ వర్కర్ కాంతమ్మ, సహాయ సహకారాలు అందించారు.

విజేత విద్యార్థులకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న డీన్ తదితరులు

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల్లో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు విశ్వవిద్యాలయ స్థాయిలో శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతిలో నిర్వహించిన అంతర కళాశాలల స్థాయి రెండో దశ క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య విభాగాల్లో విజయం సాధించిన విజేతలైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శనివారం అభినందించింది. ఏకపాత్రాభినయంలో వి.కీర్తిశ్రీ, ముకాభినయంలో ఆర్.మారుతీప్రసాద్, ఎస్.భరత్ కుమార్, కె.సత్యసాయినాథ్, జె.నరసింహా, జీఎల్‌వీ సూర్య బృందాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టి.గోపీకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు డాక్టర్ పి.అనిల్‌కుమార్, ఎం.కిషన్‌తేజ్, టి.రాఘవేంద్ర, వై.బాలచంద్ర, కళాశాల పరిపాలనాధికారి కె.కమలప్రియ, పర్యవేక్షకులు ఆర్.వాణి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ పీడీ దొరసాని

కలిగిరి: రైతులు వ్యవసాయాధికారుల సూచనలతో ఆధునిక యాజమాన్య పద్ధతులతో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆత్మ పీడీ దొరసాని తెలిపారు. వెలగపాడు రైతుభరోసా కేంద్రం పరిధిలోని కొత్తూరులో ఆత్మ ఆధ్వర్యంలో హైడ్రోజల్ వినియోగంపై ప్రదర్శన క్షేత్రం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హైడ్రోజల్ వినియోగం ద్వారా బెట్ట పరిస్థితుల నుంచి పంటలు తట్టుకుంటాయన్నారు. ఆత్మ డీపీడీ శివనారాయణ, వింజమూరు వ్యవసాయశాఖ ఏడీఏ రామిరెడ్డి, వీఏఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెల్లరాయి అక్రమ మైనింగ్

చేజర్ల: మండలంలో ప్రభుత్వం భూములు, ఆలయ భూముల్లో తెల్లరాయి అక్రమ మైనింగ్ జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజులుగా కోటితీర్థం, టీకేపాడు, పాతపాడు, కొలవనాయుడుపల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కోటితీర్థంలో దేవాలయ భూముల్లో రాత్రి వేళలో మైనింగ్ చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ కృష్ణను సంప్రదించగా తన దృష్టికి వచ్చిందన్నారు. రెవెన్యూ సిబ్బందిని మైనింగ్ ప్రాంతానికి పంపానన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని, ఎటువంటి అక్రమ మైనింగ్ జరిగినా కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

